# ‘కూటమి’ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- గ్రామస్థాయిలో రచ్చబండ కార్యక్రమాలు చేపట్టాలి
- గతంలో మనం చేసిన అభివృద్ధిని చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ పలాస మండల విస్తృత స్థాయి సమావేశంలో మాజీమంత్రి అప్పలరాజు



బాబు మోసాలను తెలియజేసే క్యూఆర్ కోడ్ కరపత్రాలను చూపిస్తున్న నాయకులు

**పలాస:** కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ‘బాబూ ష్యూరిటీ- మోసం గ్యారెంటీ’పై పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రస్థాయి నుంచి జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి వరకు సమావేశాలు జరిగాయన్నారు. ఇప్పుడు గ్రామస్థాయిలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. పలాసలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ పలాస మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మండల కమిటీ అధ్యక్షుడు దువ్వాడ రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో జరిగే కార్యక్రమాలను కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను ఇచ్చి ఏడాది దాటినప్పటికీ వాటిని అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజల్లోకి బలంగా తీసుకొని వెళ్లాలని చెప్పారు. అందుకు రచ్చబండ కార్యక్రమాల నిర్వహణతోపాటు కార్యకర్తల సెల్‌ఫోన్లే ఆయుధాలు కావాలన్నారు. పార్టీ భావజాలాన్ని ప్రసారాలు చేయడానికి ఇవి బాగా ఉపయోగపడుతాయని.. అందుకు ప్రతి కార్యకర్త, నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. అప్పలరాజు మాట్లాడుతుండగా మధ్యలో అతనికి వచ్చిన ఫోన్‌కు స్పందిస్తూ గట్టిగా చప్పట్లు కొట్టండని కార్యకర్తలకు చెప్పారు. అనంతరం ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. నిజంగానే డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగం బతికి ఉందన్నారు. కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ అక్రమంగా అరెస్టు చేసి వారిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు పెడితే న్యాయస్థానం వారికి బెయిల్ మంజూరు చేసిందన్నారు. జిల్లాలో ఎస్పీ నుంచి కిందిస్థాయి అధికారుల వరకు పాలకవర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

**అధికార పార్టీ నాయకులు చెప్పినట్టే చేస్తున్నారు..**

అధికార పార్టీ నాయకులు ఏమి చెబితే పోలీసులు, అధికారులు వాటినే అనుచరిస్తున్నారని అప్పలరాజు ఆరోపించారు. గరుడఖండలో సోషల్ మీడియా కార్యకర్తపై అక్రమంగా కేసు కట్టించి వేధించారన్నారు. ఉద్దానం ప్రాంతంలో ఢిల్లీరావు అనే వ్యక్తిని కొంతమంది హత్య చేశారని కుటుంబీకులతోపాటు గ్రామస్తులు ఆరోపిస్తుంటే ఇప్పటి వరకు ఈ కేసుపై కనీస దర్యాప్తు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు, వారి చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తుంటే వారిపై అక్రమంగా కేసులు పెట్టి భయాందోళనకు గురుచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే మన కార్యకర్తలు భయపడకుండా గట్టిగా నిలబడి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. చంద్రబాబు వాగ్దాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 50 ఏళ్లకు పింఛన్లు, 18 ఏళ్లు నిండిన మహిలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, నిరుద్యోగ భృతితోపాటు ఎన్నెన్నో ఇస్తానని చంద్రబాబు వాగ్దానాలు చేసి వాటిని అమలు చేయకుండా తప్పించుకుంటున్నారన్నారు. రైతు భరోసా ఇవ్వలేదని, ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు అన్నారని.. అయితే అది ఏ ఏడాది నుంచి అమలవుతోందో, ఎన్ని ఆగస్టులు రావాలో తెలియదన్నారు.

**జగన్ చేసిన అభివృద్ధిని చెప్పాలి..**

పలాస నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి కూడా ప్రజలకు చెప్పాలని అప్పలరాజు సూచించారు. కిడ్నీ రోగుల కోసం 200 పడకల ఆస్పత్రి, ఇంటింటికీ శుద్ధ జల కుళాయిలు, గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు.. వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. పలాసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు రెవెన్యూ డివిజన్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసి రెవెన్యూ సేవలను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. ప్రస్తుత పలాస ఎమ్మెల్యే ఈ ఏడాదిలో ఏమి చేశారో చెప్పుకోవడానికి ఒక్కటి కూడా లేదన్నారు. మంజూరు కాని కేంద్రీయ విద్యాలయం పేరు చెప్పుకొని సూదికొండ గ్రావెల్‌ను అమ్ముకున్నారని ఆరోపించారు. మే నెలలోనే తరగతులు ప్రారంభమవుతాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక వేళ మంజూరైతే మంచిదేనని.. అయితే ఆ పేరుతో గ్రావెల్‌ను తవ్వుకోవడాన్ని తాము తప్పుపట్టామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావుదొర, జిల్లా ఉపాధ్యక్షుడు పైల చిట్టిబాబు, మందస ఎంపీపీ డొక్కర దానయ్య, పలాస కీలక నాయకుడు ఉంగ సాయిక్రిష్ణ, బత్తిన హేమేశ్వరరావు, బమ్మిడి దుర్యోధన, కొర్ల మురళీకృష్ణ చౌదరి, గుండు మోహన్, తలగాన శ్రీరాములు, కొర్ల సంతోష్, బొడ్డు సుధాకర్, సవర మోహన్, మామిడి వీర్రాజు, జినగ సీతారాం, వంకల షన్ముఖరావు, జామి రామారావు, సవర లక్ష్మణ్, పాతనపల్లి మాధవరావు, దంతం వైకుంఠరావు, శిష్టు గోపి, పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

## క్లుప్తంగా

### ఆడపిల్లల భద్రతకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎస్సై పారినాయుడు

**కంచిలి:** ఆడపిల్లల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు స్థానిక ఎస్సై పి.పారినాయుడు తెలిపారు. కాశీబుగ్గ శక్తి టీం సిబ్బందితో కలిసి కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆడపిల్లల భద్రత కార్యక్రమాల్లో భాగంగా పోలీస్‌శాఖ రూపొందించిన శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. శక్తి యాప్ వాడే విధానం, యాంటీ డ్రగ్‌పై అవగాహన, సైబర్ నేరాలు, ఓటీపీల ద్వారా మోసాలు ఎలా జరుగుతున్నాయి అనే విషయాలు తెలియజేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పి.రాము, ఉపాధ్యాయులు డి.బాలక్రిష్ణ, బొడ్డ వెంకటరావు, మహిళా ఉపాధ్యాయులు కమల కుమారి, శారద, సుజాత పాల్గొన్నారు.

### 120 మందికి దంత పరీక్షలు



శిబిరంలో వైద్యులు, జేసీఐ ప్రతినిధులు

**ఇచ్ఛాపురం:** స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని జేసీఐ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 120 మంది విద్యార్థులకు డాక్టర్ వెచ్చా వాస దంత పరీక్షలు నిర్వహించడంతో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్యులు వెచ్చా రాము, పాఠశాల హెచ్‌ఎం కె.సూర్యారావు, జేసీఐ ప్రతినిధులు శణ్ముఖరావు, శిరీష, రేణుక, శ్రావ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### బాలసదన్‌ను సందర్శించిన జిల్లా సివిల్ జడ్జి



కాశీబుగ్గ: పిల్లలతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి హరిబాబు

**కాశీబుగ్గ:** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి తిలక్‌నగర్‌లోని బాలసదన్ (చిల్డ్రన్స్ హోం)ను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.హరిబాబు గురువారం సందర్శించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు బాలసదన్‌ను సందర్శించినట్టు పేర్కొన్నారు. ఇక్కడ ఉంటున్న పిల్లలతో మాట్లాడి వసతి, భోజనం, వైద్య ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. బాలసదన్ సిబ్బందితో మాట్లాడుతూ.. వసతి గృహానికి కావలసిన సౌకర్యాలు, అవసరాలు, బాలికలకు అత్యవసరంగా అందించాల్సిన సౌకర్యాలు తెలియజేయాలన్నారు.

**సోంపేట:** బాల సదన్‌లో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. సోంపేట పట్టణంలోని ఇందిరమ్మపేటలో ప్రభుత్వం నిర్వహిస్తున్న బాలసదన్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి.. అందుతున్న ఆహారం, విద్య గురించి ఆరా తీశారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పిల్లలకు సూచించారు. వంటశాల, పిల్లలు నిద్రించే గదులు, మంచినీటి సౌకర్యాన్ని పరిశీలించారు.

### డిప్యూటీ ఎంపీడీవోగా వీరభద్రస్వామి



వీరభద్రస్వామిని సత్కరిస్తున్న కార్యదర్శులు

**కంచిలి:** డిప్యూటీ ఎంపీడీవోగా గుజ్జల వీరభద్రస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన కవిటి మేజర్ పంచాయతీ ఈవోగా పనిచేస్తూ పదోన్నతి పొంది ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛంతో ఆహ్వానించి దుశ్శాలువతో సత్కరించారు.

### రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీ



జాగిలంతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

**ఇచ్ఛాపురం టౌన్:** స్థానిక రైల్వేస్టేషన్‌తో పాటు పరిసరాల్లో పట్టణ పోలీసులు నార్కోటిక్ డాగ్‌తో గురువారం తనిఖీ నిర్వహించారు. ఒడిశా నుంచి గంజాయిని ఇచ్ఛాపురం తీసుకువచ్చి రైలు మార్గం ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న నేపథ్యంలో అనుమాన ప్రదేశాలు, దకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని పట్టణ ఎస్ఐ బి.ముకుందరావు తెలిపారు.

### పట్టణ వైఎస్సార్‌సీపీ సమావేశం రేపు



ఆహ్వాన కార్యక్రమంలో పట్టణ పార్టీ నాయకులు

**కాశీబుగ్గ:** బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు శిష్టు గోపి కోరారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి సంబంధించి ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం పద్మనాభపురం, జీఆర్‌సీపురం, పెంటిబద్ర, శివాజీనగర్ కాలనీలలో పర్యటించి పార్టీ శ్రేణులను ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బిరాటి వల్లభ, కిక్కర ఆదినారాయణ, కిక్కర ప్రకాశరావు, బద్రి నాగార్జున, కొండే రాజారావు, రంది రాజారావు, డిక్కల రాంబాబు, బొల్ల భాస్కరరావు, డొక్కరి వాసు, కుమ్మరి భోగేష్ ఉన్నారు.

### మున్సిపల్ కార్మికుల నిరసన ర్యాలీ

**కాశీబుగ్గ:** సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. గతంలో జరిగిన సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త సమ్మె కాశీబుగ్గ-పలాస మున్సిపాలిటీలో రెండోరోజైన గురువారం కూడా కొనసాగింది. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతంలో 17 రోజులు సమ్మె చేపట్టామన్నారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కారం చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి రెండేళ్లు గడచినా ఇప్పటికీ పరిష్కరించలేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతిరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ మురగన్, కె.వెంకట్, ఎం.రవి అన్నారు. సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, ఆప్ కాస్ విధానం రద్దు చేసి కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. ర్యాలీలో సంఘ ప్రతినిధులు ఎస్.శంకర్, ప్రకాష్‌ముఖి, ఎస్.రమేష్, కె.ఈశ్వరరావు, బాలకృష్ణ, తిరుపతి, దివాకర్, గులాబీ, పార్వతి, పాపమ్మ పాల్గొన్నారు.

## నేడు వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం



మాట్లాడుతున్న రాజారావు

**వజ్రపుకొత్తూరు రూరల్:** మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరులో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి మండల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షులు తిర్రి రాజారావు తెలిపారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. పల్లిసారధి గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు పలు హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్, డొంక విద్యాసాగర్, కె.గోపి దానేష్ ఉన్నారు.

## ఆయిల్ పామ్ సాగుకు అనుకూలం



ఆయిల్ పామ్ మొక్కలు నాటుతున్న దృశ్యం

**సోంపేట:** ఆయిల్ పామ్ తోటల సాగుకు మండలంలోని భూములు అనుకూలంగా ఉన్నాయని ఉద్యానశాఖ సహాయ సంచాలకులు కె.చిట్టిబాబు అన్నారు. పలాపురంలో ఉద్యానశాఖ ద్వారా శ్రీ శ్రీనివాస ఆయిల్ పామ్ కంపెనీ సౌజన్యంతో దువ్వి కృష్ణారెడ్డి పొలంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటే ప్రక్రియను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో సోంపేట మండలంలో శాస్త్రవేత్తలు పర్యటించి ఆయిల్ పామ్ సాగుకు భూములు అనుకూలంగా ఉన్నట్లు సూచించడం జరిగిందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి ఉన్న రైతులను వీరఘట్టం, పాలకొండ, రణస్థలం మండలాలు తీసుకెళ్లి పంట సాగుచేస్తున్న రైతులతో అనుభవాలు తెలియజేయడం జరిగిందన్నారు. ఆయిల్ పామ్ తోటలు పెంచడానికి ప్రభుత్వం ప్రోత్సాహకం అందజేస్తుందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు తమను సంప్రదించాలన్నారు. ఉద్యాన శాఖాధికారి పోలాకి మాధవిలత, సహాయ ఉద్యానశాఖాధికారి బాలరాజు, కంపెనీ మేనేజర్ వీరబాబు, ఎంఏఓ శరణ్య, గ్రామవ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### మత్స్యకార భవనానికి శంకుస్థాపన

**వజ్రపుకొత్తూరు:** దేవునల్తాడ గ్రామంలో పీఎంఎంఎస్‌వై నిధులు రూ.1.34 కోట్లతో నిర్మించతలపెట్టిన మత్స్యకార భవనానికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవునల్తాడ గ్రామం వెబ్ సైట్‌ను సర్పంచ్ టి.వరదరాజు, పంచాయతీ కార్యదర్శి కె.కామరాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ బి.సురేష్, నాయకులు తులే అప్పోజి, పి.విఠల్, పి.ఈశ్వరరావు, కె.రమణ, గోవింద, పాపారావు పాల్గొన్నారు.

### జేఎల్‌ఎం మృతికి సంతాపం

**వజ్రపుకొత్తూరు:** పల్లిసారధి సచివాలయం జేఎల్ఎం.మణిగాం జయక్రిష్ణ (29) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో స్వగ్రామం పెద్దబొడ్డపాడులో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన కుటుంబాన్ని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, నాయకులు పరామర్శించి సంతాపం తెలియజేశారు.

### రక్తదానం

**కాశీబుగ్గ:** వజ్రపుకొత్తూరు మండలం ఉద్దాన రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన కాంతమ్మ అనారోగ్యంతో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమెకు అత్యవసరంగా రక్తం అవసరమైంది. అయితే ఓ నెగిటివ్ కావడంతో దొరకడం కష్టమైంది. విషయం ఆ నలుగురు రక్తదాతల సంస్థ సభ్యులకు చేరింది. సంస్థ ప్రతినిధుల సహకారంతో పలాసకు చెందిన సురేష్ కుమార్ గురువారం రక్తదానం చేసి కాంతమ్మకు ప్రాణభిక్ష పెట్టారు.

### ప్రమాణ స్వీకారం



పీఏసీఎస్‌లు రైతులకు అండగా నిలవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకరణ కార్యక్రమం గురువారం జరిగింది. అధ్యక్షులుగా కణితి సురేష్ చౌదరి, డైరెక్టర్‌లుగా కొత్తూరు అప్పారావు, రాపాక శాంతమూర్తి ప్రమాణ స్వీకరణ చేసి బాధ్యతలు స్వీకరించారు. రైతులకు అండగా ఉంటూ పీఏసీఎస్‌ల పరపతిని మరింత పెంచాలని అన్నారు. మాజీ మంత్రి గౌతు శివాజీ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కుల సంఘ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మండల అధ్యక్షులు సూరాడ మోహన్‌రావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ హేమబాబు చౌదరి, మాజీ ఎంపీపీ సూర్యానారాయణ, కర్ని రమణ, హనుమంతు గిరి, దాసరి దాశరధి, బి.శశిభూషణ్ పాల్గొన్నారు.

–వజ్రపుకొత్తూరు రూరల్/వజ్రపుకొత్తూరు

### మున్సిపల్ కార్మికుల సమ్మెబాట



ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఇచ్ఛాపురం పురపాలకసంఘం పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సమ్మెబాట పట్టారు. ఈ విషయాన్ని యూనియన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ఎ.రమేష్ పట్నాయక్ తెలిపారు. స్థానిక మస్టర్ కార్యాలయం ఆవరణలో గురువారం సాయంత్రం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. సిబ్బందికి వేతనాలు పెంచాలని, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు డిమాండ్లను పరిష్కరించే విధులను బహిష్కరించి సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంఘ నాయకులు డి.లక్ష్మణరావు, డిల్లీ, గంగాధర్‌రథో, మంగళసత్తు ఉన్నారు.

–ఇచ్ఛాపురం

# గ్రామీణ రోడ్లకు గ్రహణం!

- పూర్తిగా శిథిలమైన ఉప్పలాం రోడ్డు
- అడుగడుగునా గుంతల మయం



గోతులమయమైన టి.శాసనాం-ఉప్పలాం రోడ్డు



గోతుల్లో చేరిన వర్షం నీరు తాగుతున్న గొర్రెలు

**సోంపేట:** కూటమి ప్రభుత్వ పాలనలో పల్లెరోడ్లకు గ్రహణం పట్టింది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోంపేట మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. పాత జాతీయ రహదారి నుంచి ఉప్పలాం పంచాయతీకి వెళ్లే రోడ్డు పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. దీంతో మత్స్యకార గ్రామాలకు వెళ్లే ప్రజల కష్టాలు వర్ణనాతీతం. అధికారులు, పాలకుల హామీలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. నిధులు మంజూరయ్యాయి, పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు తప్పా పనులు ముందుకు సాగడం లేదని ప్రజలు వాపోతున్నారు. పాత జాతీయ రహదారి నుంచి ఉప్పలాం పంచాయతీకి వెళ్లే సుమారు ఏడు కిలోమీటర్ల రహదారి పరిస్థితి దారుణంగా తయారైంది. ఉప్పలాం పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాలు, గొల్లూరు పంచాయతీలోని మూడు గ్రామాలు, టి.శాసనాం పంచాయతీ, రాజం, సిరిమామిడి గ్రామాలకు వెళ్లే ప్రజలు ఈ రహదారిని ఎక్కువుగా వినియోగిస్తున్నారు. ఉప్పలాం పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాల ప్రజలకు జీవనాధారం చేపలు వేట. చేపలు పట్టి విక్రయించడానికి ఈ రోడ్డే దిక్కు. మండల కేంద్రానికి చేరుకోవాలన్నా ఈ రహదారినే వినియోగించాలి. అయితే ప్రస్తుతం ఈ రోడ్డు అడుగడుక్కో మడుగు..గజానికో గొయ్యితో దర్శనమిస్తోంది.

**పాడవుతున్న వాహనాలు..**

రహదారి పొడవునా పెద్ద గోతులు ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గోతుల్లో చేరిన వర్షం నీటిని గొర్రెలు తాగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనాలు తరచూ పాడవుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నామంటున్నారు. ఇప్పటికైన అధికారులు, కూటమి నాయకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి తమ కష్టాలు తీర్చాలని 20 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### చాలా ఇబ్బందులు పడుతున్నాం



రహదారి పూర్తిగా గోతులు మయం కావడంతో ప్రజులు ఇబ్బందులు పడుతున్నాం. ద్విచక్ర వాహనంతో వెళ్లాలంటే భయం వేస్తుంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆటో డ్రైవర్ల ఇక్కట్లు వర్ణనాతీతం. రహదారి పనులు వేగవంతం చేసి కష్టాలు తీర్చాలి.

–తెప్పల సతీష్, గొల్లూరు

### సమస్య పరిష్కరించాలి



రహదారికి నిధులు మంజూరు చేశాం. త్వరలోను పనులు ప్రారంభం అవుతాయని అధికారులు చెబుతున్నా ఇప్పటివరకూ పనులు ప్రారంభం కావడం లేదు. జంగిల్ క్లియరెన్స్ చేసి పనులు నిలుపుదల చేశారు. వెంటనే పనులు ప్రారంభించి ప్రజల సమస్యను పరిష్కరించాలి.

– పిన్నింటి రేఖరావు, గొల్లూరు

### రోడ్డు పనులు పూర్తి చేస్తాం

రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడం జరిగింది. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.

– ధనుంజయం, పీఐయూ జేఈ

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

**కంచిలి:** బూరగాంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలు గ్రామస్తులు కోరారు. రెండు రోజులుగా ఎస్సీ, బీసీ కాలనీల్లో రాత్రి వేళలో సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ మేరకు కంచిలి మండల విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్‌శాఖ సోంపేట సబ్‌డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రవికుమార్, ఏఈ ఎన్.గురవయ్యలను గురువారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలోని గొల్లవీధిలో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో సమస్య ఏర్పడుతున్నట్లు తెలిపారు. అధికారులను కలిసిన వారిలో బొడ్డు అప్పారావు, మద్దిల ప్రేమ్ కుమార్, మాస్టీల మన్మథరావు, కొక్కిలి రాజు, బూతాడ శ్రీకాంత్, పిలక ఢిల్లీరావు, మాస్టీల జానకీరావు, బూడిద పాపారావు ఉన్నారు.

**CHANGE OF NAME and DATE OF BIRTH**

I, **NEYYELA SAKUNTHALA** W/o DEENABANDHU NEYYELA, mother of No. **4577816L HAV, PRAKASH NEYYELA**, serving with 4 MAHAR (BORDERS) residing at D.No.3/20A, Village-Innesupeta, Post-Dharmapuram, Tulasigam Panchayat, Mandal-Ichapuram, Dist-Srikakulam, State-Andhra Pradesh, Pin - 532312, hereby declare that my correct name is **NEYYELA SAKUNTHALA** and my correct Date of Birth is **11 April 1956**. But, in my Son's Service records my Name is wrongly mentioned as **SAKUNTALA** instead of **NEYYELA SAKUNTHALA** and my date of birth is wrongly mentioned as **07 November 1943** instead of correct DOB **11 April 1956**. Vide affidavit dated 14-06-2025 sworn before notary at Itchapuram.

### వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

**టెక్కలి:** వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని టెక్కలి మండలం కె.కొత్తూరు మెడికల్ అధికారి ఎస్.గాయత్రీ సూచించారు. గురువారం స్థానిక బాలికల సమీకృత వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డైనింగ్ హాల్, డార్మెటరీతో పాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వసతి గృహంలో మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని, వసతి గృహంలో వ్యర్థాలను రోజూ తొలగించాలని, విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వంటశాలను మరింత పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వార్డెన్ ఎస్.విజయలక్ష్మితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.